# "పిచ్చివాసు - వాస్తుపిచ్చి"

- డా. సుదర్శన్ రాజ్, టొరోంటో, కెనడా

వాసుదేవరావు, సూరిబాబు దాదాపు పదేళ్ళ క్రితం 'టొరోంటో' లోనున్న 'జెర్రార్డ్‌వీధి' లో తటస్థ పడ్డం, తెలుగువారని తెలుసుకున్న తర్వాత క్రమేణా ప్రాణ మిత్రులవడం జరిగింది. కెనడావచ్చిన మూడేళ్ళకే ఒకచిన్న ఇల్లు కొనేసి, వాసు పరి చయందగ్గరనుంచి ఇల్లు కొనమని పోరుతున్నాడు వాసుని సూరిబాబు. "ఎన్నాళ్ళుంటావు ఈ అద్దె కొంప లో? నీ స్వంతిల్లుంటే చక్కగాపిల్ల లాడుకుందుకు 'బేస్‌మెంటు', 'బాక్ యార్డ్' ఉంటాయి. చక్కగా మీకు 'మాస్టర్ బెడ్‌రూమ్, ఎటాచ్డ్ బాత్‌రూమ్' ఉంటాయి. పదిమందిని పిల్చినా ఇరుకు లేకుండా 'ఫామిలీ రూము', 'లివింగ్‌రూము' ఉంటాయి. పైగా ఎవడి 'మోర్ట్‌గేజో' తీర్చే బదులు, నీ 'మోర్ట్‌గేజ్' తీర్చు కుంటూ "ఈక్విటీ' 'బిల్డప్' చేసుకోవచ్చుగా!" అంటూ నూరిపోసే వాడు సూరిబాబు.

సూరిబాబుకి ఎవరికైనా సాయంచెయ్యాలంటే మహా సరదా. అతడంటే వాసుకి మహా గురి. "నువ్వు 'ఊ' అనాలే గాని, వాస్తుచూసి నీకు మాంఛి ఇల్లు కుదిరేటట్లు చూసి పెట్టా" అంటూ తనకేదో వాస్తుశాస్త్రంలో ప్రావీణ్యత ఉన్నట్లుగా ప్రవర్తించేవాడు సూరిబాబు. ఆరోజు ఏ 'మూడ్' లో ఉన్నాడో వాసు - "సరే ఎల్లుండి శుద్ధపంచమి. నా తార ప్రకారం సంపత్తార. ఇళ్ళు వెదకటంప్రారంభిద్దాం" అన్నాడు వాసు.

"ఏజెంటుని 'రీమేక్సోడినే' ఎంచుకో! 'సట్ట నూ, గిట్టనూ' రియలెస్టేటు వాళ్ళనివద్దు" - అన్నాడు సూరిబాబు. "మనకెవరైతేనేమి? కొనేవాళ్ళం, మన మేమి పైసా కమిషన్ ఇయ్యక్కర్లేదుగా?" అన్నాడు వాసు.

"నీకు తెల్దులే! సట్టనూ, గిట్టనూ 'రియలెస్టే టు'లు చాలా చీపు కంపెనీలయ్యా. 'రీమేక్స్' అంటేనే వాళ్ళ 'స్టైలే' వేరు. మాట్లాడే తీరే వేరు. బేరమాడే విధానమే వేరు. వాళ్ళ బెలూన్ చూస్తేనే తెలుసుద్ది వాళ్ళ 'స్టైలు'. నాకు తెలిసున్న పంజాబీ ఏజెంటు సియ్యాళ పిల్చి చెప్పేస్తా! ఆడిపేరు 'పాల్'. పూర్తి పేరు 'భూపాలసింగు' లే. మనమో ఏభై ఇళ్ళు చూచేసి వాస్తు ప్రకారం మాంఛి ఇల్లు కొనుక్కుందువుగానిలే" అంటూ తన 'రియలెస్టేటు' విజ్ఞానం కూడా చూపించుకున్నాడు సూరిబాబు.

"వాస్తు, వాస్తు" అంటావు. అదేమిటో కాస్త వివరిస్తావా? అడిగేడు వాసు. "ఓ! దానికేముందీ ముఖ్యమైన సూత్రాలు చెప్తాను. శాస్త్రం అంతా నాకు తెల్దులే" అంటూ ప్రారంభించేడు సూరిబాబు. "నీకు దిక్కులు తెల్సు గదా?" అన్నాడు సూరిబాబు. "ఓ! తెలీకేం? చిన్నదిక్కు, పెద్దదిక్కు" అన్నాడు వాసు.

సూరి: అదికాదయ్యా! నాలుగు దిక్కులు - తూరుపు, పడమర, ఉత్తరం, దచ్చినం.

వాసు: అవి తెలీకేమి? ఎటొచ్చీ దచ్చినం కాదు, దక్షిణం - సరి చేసేడు.

సూరి: నా ఏసకి ఎటకారంసెయ్యక. అది సరే! మరి మూలలు తెలుసా?

వాసు: అదో మూల, ఇదో మూల, మరో మూల, మారు మూల - అంతేనా?

సూరి: నీకున్నమతి బోతోందనుకుంటా! ఈశానం, వాయవం, నైరుతి, ఆగ్గేయం.

వాసు: ఓ! అవా ఈశాన్యం, నైరుతి, వాయవ్యం, ఆగ్నేయం -- సరిదిద్దేడు..

సూరి: ఆ అయే. మరైతే నీకు సగంవాస్తు వచ్చేసినట్లే. తూర్పున సింహద్వారముండాలి, ఈశానంలో దేవుడి గదుండాలి, ఆగ్గేయంలో అగ్గుండాలి, వాయవంలో బాగా బరువుండాలి. నైరుతి గదిలో యజమాని పడుకోకూడదు. పడుకునేటప్పుడు తల దచ్చినం ఏపు పెట్టుకుని పడుకోవాల. ఇవి ముఖ్యసూత్రాలు. ఇండియాలో అయితే స్వంతగా అన్నీచూసి కట్టించుకోవచ్చు. మరి కెనడాలో అన్నీకుదరవు కదా! 70% సరిపోతే తక్కిన మార్పులు ఇంట్లో చేరిన తర్వాత నువ్వే చేయించుకోవచ్చు.

సూరిబాబు చెప్పిన సూత్రాలు వినగానే సగం వాస్తు శాస్త్రం పాండిత్యం వచ్చినట్లే 'ఫీల య్యా డు' వాసు.

వాసు: ఒక ప్రశ్న! ప్రపంచంలో అందరూ వాస్తు చూసే బ్రతుకుతున్నారంటావా సూరిబాబూ?

సూరి: సుఖంగా ఉన్నవాళ్ళందరూ వాస్తుచూసి సరైన ఇళ్ళలో ఉండైనా ఉండాలి, లేదా, వారికి తెలియకుండానే సరైన వాస్తు కుదిరుండాలి. అందుకే సుఖంగా ఉండే వారిశాతం చాలా తక్కువ. వాస్తు శాస్త్రం ఒక అగాధం లాటిది. తక్కిన శాస్త్రాల్లాగే ఎన్నో పరిశోధనలు చేసి కొన్ని తీర్మానాలకి వచ్చిన శాస్త్రం. అంతేకాని అల్లాటప్పా యవ్వారం కాదు.

వాసు చాలా 'సింపుల్' మనిషి. అంతేగాని 'సింపుల్టన్' మాత్రం గాదు. ఏదైనా బుఱ్ఱలో పడాలేకాని, వెంటనే గ్రంధాలయానికెళ్ళి, ఆ 'సబ్జెక్టు' ని కరతలామలకం చేసేస్తాడు. అదే విధంగా వాస్తు మీదకూడా. సూరిబాబు వాస్తు గురించి ఏ రోజు విత్తనంవేసేడో కాని, ఆశాస్త్రాన్ని చదవాలన్న కుతూహలంతో ఎవరో మనదేశం వెళ్తాంటే 'తిరుపతి రెడ్డిగారు' రచించిన 'వాస్తుశాస్త్రవాస్తవాలు' పుస్త కం తెప్పించుకుని చదివేడు.

అనుకున్న ప్రకారం పంచమినాడు ప్రారంభించేరు, ఇళ్ళవేట. వీళ్ళ వాస్తుగురించి పాల్‌కి తెలియదు, వీరు చెప్పలేదు. వాసు 'బడ్జెట్' కి అను గుణంగానే చూపిస్తున్నాడు పాల్. ఎంత మంచి ఇళ్ళు చూపించినా వీళ్ళకి నచ్చటం లేదు. ప్రతీ ఇంటి దగ్గర నుంచుని 'దిక్సూచి' ని పట్టుకుని చూస్తారు. పెదవులు విరిచి తలలూపుతారు. పాల్‌కి ఏమీ బోధ పడటంలేదు. వీళ్ళుచెప్పరు. పైగా కెనడాలోసూర్యు డెప్పుడూ సరిగా తూర్పున ఉదయించడు, పశ్చిమా న అస్తమించడు. అది సూర్యుని తప్పు కాదు. గోళం వంపు తప్పు. ఉండబట్టలేక అడిగేడు పాల్ - ఏమిటి చూస్తున్నారు. ప్రతీ ఇంటి దగ్గిర 'కంపాస్ ' పట్టుకుని, చివరికి తలూపేస్తారు?

"నీకేం తెలీదులే! మాకు నచ్చిన ఇల్లు చూపించు. అప్పుడాలోచిస్తా' మన్నాడు సూరిబాబు. "మీ కెటువంటి ఇల్లు కావాలో చెప్తే కదా! మూడులక్షల డాలర్లలో ఉన్న 'డిటాచ్డ్‌హౌస్' అన్నారు.- అలాగే చూపిస్తున్నాను" అన్నాడు పాల్. "అది కాదయ్యా, మాకు 'ఈస్ట్ ఫేసింగ్' ఇళ్ళు చూపించు" అన్నాడు సూరిబాబు. "ఓ అదా! కంప్యూటర్ లో చూసి రేపే చూపిస్తానని, పది 'సెలెక్టు' చేసి మరుసటి రోజు చూపించేడు పాల్. పదిళ్ళూ చూసి, పెదవి విరిచి, ఇవి కాదన్నాడు సూరిబాబు. పాల్ కి వళ్ళుమండి పోతోంది.

"మీ రడిగినవే చూపేను కదా!" అన్నాడు పాల్. "మేము అడిగిన వాటికి సరిగా వ్యతిరేకమైనవి చూపించేవు" అన్నాడు సూరిబాబు. "అంటే 'వెస్ట్‌ఫేసింగ్' వి కావాలన్నమాట. అప్పుడు మీ ఇంటి సింహద్వారము 'ఈస్ట్' కి వస్తుంది. అప్పుడు మీరు 'ఈస్ట్' లోంచి 'ఎంటర్' అవ్వచ్చు" అన్నాడు పాల్.

"ఎక్సాక్ట్‌లీ' - ఇన్నాళ్ళకి నీకర్థమైంది మా 'పాయింటు' అన్నాడు సూరిబాబు. "ఇన్నాళ్ళూ నాకు చెప్తేనా! నాకర్థమౌడానికి?" అన్నాడు పాల్. మరో పదిళ్ళు చూపించేడు పాల్. ప్రతీ ఇంటికి ఏదో వంక. వంటగది ఇక్కడుందనో, బాత్ రూమ్ అక్కడుందనో, క్లోజెట్ ఇక్కడుండ కూడదనో, స్థలంకోసుగా ఉందనో మూతి వంకర పెట్టటం చేశాడు సూరిబాబు.

పాల్ రక్తం ఉడికిపోతోంది. *Mr. Suribabu! You don’t get a perfect house and a perfect spouse--especially in Canada. You can make some alterations after you move into the house”* అన్నాడు విసుగ్గా పాల్. ఇంకా కొన్ని ఇళ్ళు చూపించమంటే ఈ పంజాబీవాడు ఏ ‘బేస్‌మెంటు’ లోనో మక్కెలిరగ్గొట్టి 'కోల్డ్‌రూమ్' లో *dump* చేస్తాడేమో నన్న భయం పట్టుకుంది సూరిబాబుకి.

వాసు వైపు తిరిగి "70% బాగుంటే తక్కిన 30% పర్వాలేదు. చిన్న చిన్న మార్పులు ఇంట్లో చేరిన తర్వాత నువ్వు చేయించుకోవచ్చులే" అని ఒక ఇల్లు కొనిపించేడు వాసుచేత. సూరిబాబు చెప్పింది వేదవాక్యం వాసుకి. ఈ రెండు నెల్ల ఇళ్ళవేటలో కాస్త 'వాస్తుజ్ఞానం' మిడి మిడిగా వచ్చేసింది.

తెలిసున్న ఐదారు కుటుంబాలను పిల్చి గృహప్రవేశం ఘనంగానే చేసేడని విన్నాను. ఊళ్ళోలేనందున నేను వెళ్ళలేకపోయాను. మూడు నెల్లైన తర్వాత ఒక రోజు ఆ వీధిలో వెళ్తూ వాసు ఉన్నాడేమోనని తలుపు తట్టాను. అదృష్టవశాత్తు వాసు ఇంట్లోనే ఉన్నాడు. నన్ను చూడగానే వాడిముఖం చేటంతయ్యింది.

"రా!రా! ఒక్కడివే వచ్చేవేమి? సుశీలనికూడా తీసుకురాలేకపోయావా?" అన్నాడు వాసు. 'లివింగ్ రూమ్’ లోకి తీసుకెళ్ళి 'లెదర్‌సోఫా' లో కూర్చోమన్నాడు. మూడునిముషాలుకూర్చున్నానో లేదో నాకు తెలియకుండానే ముందుకు జారుకుని తివాసీమీదకి పడ్డాను. 'లెదర్‌సోఫా' చాలా సిగ సిగలాడుతోంది - అందుమూలాన జారి పడ్డాననుకున్నాను. తర్వాత మాట ల్లోతెలిసింది - ఆ ఇంటికి వాస్తు ప్రకారం 'లివింగ్‌రూమ్' 'స్లోపు' గా ఉండాలని గచ్చు 'స్లోపు' చేయించేడుట.

'మాస్టర్ బెడ్‌రూమ్' కి 'ఎటాచ్డ్‌బాత్‌రూమ్ విత్ జకూజి' ఉంది. అది నైరుతి మూలలో ఉండటం మూలానా పిల్లలకిచ్చేశాడుట. ఆ గదిలో యజమాని పడుకో కూడదుట. రెండో బెడ్‌రూమ్‌కి కూడా 'ఎటాచ్డ్‌బాత్‌రూమ్' ఉంది కాని తలుపులు కూడా తెరవడానికి వీలులేకుండా 'డ్రైవాల్' పెట్టి మేకులు కొట్టబడి ఉన్నాయి. అలా ఎందుకు చేశావని అడిగేను. 'బాత్‌రూమ్' ఆమూల ఉండకూడదు. అది వాడమన్నాడు. మంచం 'హెడ్‌బోర్డు' గోడవైపు లేకుండా

వ్యతిరేకపు వైపు ఉంది. ఎందువల్లంటే తల దక్షిణం వైపు పెట్టాలిట.

"కాఫీతాగుదాం, రా" అన్నాడు వాసు. సరే నని క్రిందకి వెళ్ళాము. పిల్లలు, భార్య షాపింగ్‌కి వెళ్ళారుట. కాబట్టి వాడే కాఫీ పెట్టడం ప్రారంభిం చేడు. కాఫీ 'కిచెన్' లో పెట్టలేదు. ఆగ్నేయ మూలలో ఒక బల్ల మీద రెండు 'కోయిల్స్' ఉన్న 'హాట్ ప్లేట్' మీద వంటచేస్తారుట. అక్కడే 'పెర్కొలేటర్' 'ఆన్' చేసేడు. వంటలన్నీ అక్కడే చెయ్యడం మూలాననుకుంటా బల్ల వెనకాల గోడసిండా నూనె మరకలు. ఆగ్నే యంలో అగ్గుండాలని సూరిబాబు నొక్కి వక్కాణించేడుట.

సరే 'బేస్‌మెంట్' చూపిస్తానని తీసుకె ళ్ళాడు. తూర్పు వైపున 'షవర్' తో 'బాత్‌రూమ్' కట్టించేడు. 'టాయిలెట్, సింకు' అక్కడే కట్టడానికి వీల్లేకపోయిందిట. వేరేగా ఉత్తర ముఖంగా వచ్చేటట్లు కట్టించేడు. స్నానాలు 'బేస్‌మెంటు' లోనే చేస్తారుట. అక్కడే తక్కిన కార్యక్రమాలు. 'బేస్‌మెంటు' లో గోడల సిండా మట్టిచారలు. "అవేమిటి ఆ చారలు?" అనడిగేను.

"'బాక్‌యార్డు' లో దక్షిణం వైపు వాస్తుప్రకారం ఎత్తుండాలని మట్టిపోయించేను. రెండువారాల క్రితం వచ్చిన పెద్ద గాలివానకి నీళ్ళు కాస్త లోపలికి వచ్చి చారలు పడ్డాయి, అంతే" అన్నాడు వాసు.

'గ్రేడింగ్' ఎందుకు చేస్తారో వాసుకి అర్ధమైనట్లు లేదు. అయినా వాడితో వాదనెందుకులే అని ఊరుకున్నాను. "నేను వెళ్ళొస్తా" అని లేవబోతూ "ఈ మార్పులన్నిటికీ ఎంత ఖర్చైందన్నాను". "దాదాపు పద్దెనిమిది వేల డాలర్లయింది" అన్నాడు. "అందరూ 'హేపీ' గా ఉన్నారా?" అని అడిగాను.

"మాఆవిడ వంటచేస్తున్నంత సేపూ ఏదో గొణుక్కుంటూ ఉంటుంది. పిల్లలు కిందకొచ్చి కాలకృత్యాలు, స్నానాలుచెయ్యడానికి రోజూ మారాలే చేస్తారు. నాకు మాత్రం హాయిగా నిద్రపడుతోంది" అన్నాడు వాసు.

"ఉద్యోగంలో ఏమైనా మార్పుందా?" అన్నాను. "నెలకిపద్దెనిమిది డాలర్లింక్రిమెంటు వచ్చింది" అన్నాడు వాసు. వాసు సుఖంగా ఉండటమే నాకు కావాలి. వాడిల్లు ఎలాగుంటే నాకేమి? ఎవడి పిచ్చి వాడికానందం. "పిచ్చి వాసుకి వాస్తు పిచ్చి" ఆనందం.

***